

ముఖ్యమంత్రి పర్యటనకు పటిష్ట భద్రత

ప్రజాశక్తి- కడప అర్బన్

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పర్యటన నేపథ్యంలో చేపట్టవలసిన భద్రతా ఏర్పాట్లపై ఆదివారం పోలీసు అధికారులకు ఎస్‌పి ఇ.జి అశోక్ కుమార్ పలు సూచనలు చేశారు. ఎయిర్ పోర్ట్ నుంచి ముఖ్యమంత్రి కార్యక్రమం నిర్వహించే పబ్బాపురం వేదిక వరకూ కాన్వాయి రిహార్సల్ నిర్వహించారు. ఎయిర్ పోర్ట్ నుంచి కాన్వాయి వచ్చే మార్గంలో చేపట్టాల్సిన భద్రతా చర్యలపై పోలీస్ అధికారులకు దిశానిర్దేశం చేశారు. కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని, అప్రమత్తంగా ఉంటూ విధులు నిర్వర్తించాలని ఆదేశించారు. కార్యక్రమంలో పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

చకచకా మహానాడు ఏర్పాట్లు



- పసుపు మయంగా మారిన కడప
- ఫుడ్‌జోన్, మహాసభ, పార్కింగ్ వసతులపై శ్రద్ధ
- మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు రోజువారీ సమీక్షలు
- 23 వేల మందితో ప్రతినిధుల సభ
- ఐదు లక్షల మందితో మహాసభ నిర్వహణ

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

జిల్లాలో మహానాడు ఏర్పాట్లు శరవేగంగా సాగుతున్నాయి. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి తొలిసారిగా కడప జిల్లా కమలాపురం నియోజకవర్గం పబ్బాపురం సమీపంలోని 145 ఎకరాల విస్తీర్ణంలో మహానాడును నిర్వహిస్తోంది. ఈ నెల 27, 28, 29వ తేదీల్లో మహానాడు నిర్వహిస్తున్నామని ప్రకటించింది. టిడిపి రాష్ట్ర నాయకత్వం మహానాడు కార్యక్రమ నిర్వహణను ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. మహానాడు నిర్వహణ తేదీలు దగ్గర పడుతున్న నేపథ్యంలో ఏర్పాట్లపై ప్రత్యేకంగా దృష్టి సారించింది. టిడిపి రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు జిల్లాలోనే మకాం వేసి మహానాడు ఏర్పాట్లపై దృష్టి సారించించారు. ఆయనకు తోడుగా ప్రతిరోజూ ముగ్గురు, నలుగురు మంత్రులు పరిశీలించడం, పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర సీనియర్ల సలహాలు, సంప్రదింపులు, సూచనలు, పర్యవేక్షణలతో ముందుకు సాగుతోంది. రాష్ట్ర మంత్రులు అనగాని సత్యప్రసాద్, గుండు సుధారాణి, మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, బిసి జనార్ధన్‌రెడ్డి, టిడిపి రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు, ఎమ్మెల్యేలు నంద్యాల వరదరాజులరెడ్డి, ఆర్.మాధవి, పుత్తా చైతన్యరెడ్డి, ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి, బిటెక్ రవి, అన్నమయ్య జిల్లా టిడిపి ఇన్‌ఛార్జి జగన్‌మోహన్‌రాజు తదితరులు ఏర్పాట్ల పురోగతిని సమీక్షించారు.

వసతి సదుపాయాల కల్పనపై దృష్టి

ప్రతినిధుల సభకు 23 వేల మంది హాజరు కానున్నారు. అవసరమైన వేదిక ఏర్పాట్లు, భోజన వసతి, పార్కింగ్ సదుపాయాలపై దృష్టి సారించారు. చివరి రోజైన 29న ఐదు లక్షల మందితో భారీ బహిరంగ సభను ఏర్పాటు చేయనున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఐటి, విద్యాశాఖా మంత్రి నారా లోకేష్ మూడు రోజులపాటు కడపలోనే ఉండడనున్నారు. పార్టీ నాయకత్వం, కలెక్టర్, జెసి, ఎస్‌పి, రాయలసీమ డిఐజి కోయ ప్రవీణ్, డిజిపి హరీష్‌కుమార్ గుప్తా ముఖ్యమంత్రి బస, మహానాడు వేదిక ఏర్పాట్లు, భద్రత తదితర వ్యవహారాలపై ప్రధానంగా దృష్టి సారించారు. ఫుడ్‌జోన్, పార్కింగ్ తదితర ఏర్పాట్లు క్లైమాక్స్ దశకు చేరుకున్నాయి.

పకడ్బందీ నిర్వహణపై కసరత్తు

ఆర్‌అండ్‌బి అతిథిగృహంలో మహానాడు ఏర్పాట్లు, వసతి సదుపాయాలపై రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు అధ్యక్షతన మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, నియోజకవర్గ ఇన్‌ఛార్జిలు సమావేశమై సుదీర్ఘంగా చర్చించారు. మహానాడుకు ఎంతమంది జనాభా హాజరవుతారు. వచ్చిన వారికి భోజన వసతుల ఎక్కడ ఏర్పాటు చేయాలి, ఏయే ప్రాంతాల వారి వాహనాలకు ఎక్కడెక్కడ పార్కింగ్ ఏర్పాట్లు చేయాలి, ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, ఇతర సదుపాయాల కల్ప నలో ఎక్కడా లోటుపాట్లు తలెత్తకుండా చూడాలనే దిశగా ఆలోచనలు సాగిస్తున్నారు.

కడప గడపలో పసుపు శోభ

టిడిపి మహానాడు సందర్భంగా కడప నగరమంతా పసుపు శోభను సంతరించుకుంది. కడప నగరంలోని ప్రధాన రహదారులు, ప్రధాన కూడళ్లన్నీ పసుపుజెండాలు, ముఖ్యమంత్రి చంద్రబాబు, లోకేష్ పొటోలతో కూడిన భారీ ఫ్లెక్సీలతో దర్శనమిస్తోంది. కడప నగరంలోని రహదారుల గుంతలు పూడ్చివేత, రహదారులను వెంబడి డివైడర్లకు మార్కింగ్ వేయడం వంటి పనులు శరవేగంగా సాగుతున్నాయి.

కరోనా కలకలం మధ్య

ప్రత్యర్థి నేత జగన్ ఇలాఖాలో టిడిపి ప్రతిష్టాత్మకంగా మహానాడు నిర్వహిస్తోంది. ఎటువంటి పొరపాట్లు దొర్లినా రాజకీయ విమర్శలకు ఆస్కారం ఏర్పడుతుంది. గతంలో కృష్ణా పుష్కరాలు, ప్రకాశం జిల్లా తొక్కిసలాట వంటి ఘటనలు మచ్చగా మారిన నేపథ్యంలో పకడ్బందీ జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. జిల్లాలో కరోనా అనుమానాస్పద కేసు నమోదైన నేపథ్యంలో మహానాడును విరమించుకోవాలనే డిమాండ్ల నేపథ్యంలో ముందుకు సాగుతున్న నేపథ్యం రాజకీయ విమర్శలకు ఆస్కారం ఏర్పడిన నేపథ్యం తెలిసిందే.

వాహన పార్కింగ్‌పై దృష్టి

ట్రాఫిక్ నిర్వహణపై ప్రధాన సమస్యగా మారనుంది. మహానాడు వేదికకు ఎదురుగా ఉన్న మైదానాలలో వాహన పార్కింగ్ ఏర్పాట్లు చేశారు. ఉమ్మడి కడప జిల్లాలోని 11 అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి పెద్దఎత్తున బహిరంగ సభకు వాహనాలు వచ్చే అవకాశం ఉంది. ఒక్కో నియోజక వర్గం నుంచి రెండు వేల నుంచి మూడు వేల వాహనాలు వచ్చే అవకాశం ఉంది. ఈ లెక్కన 29 నాటి బహిరంగ సభకు జిల్లాలోని 11 నియోజకవర్గాల నుంచి సుమారు 25 వేల వాహనాలు, రాష్ట్రంలోని 26 జిల్లాలు, రాష్ట్రేతర ప్రాంతాల నుంచి సుమారు 50 వేల వరకు వాహనాలు వచ్చే అవకాశం ఉంటుంది. వీటన్నింటికీ వసతి సదుపాయాల కల్పన చేయడం ఎలా అనే కోణంలో చర్చిస్తోంది.



కడప నగరంలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు, బ్యానర్లు

వేదిక, ప్రాంగణాలను పరిశీలించిన మంత్రులు

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

కడప జిల్లా కమలాపురం నియోజకవర్గం చింతకొమ్మదిన్నె మండలం పబ్బాపురం-చెర్లోపల్లి పరిసర ప్రాంతాల్లో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న టిడిపి రాష్ట్ర మహానాడు ఏర్పాట్లపై రాష్ట్ర మంత్రులు అచ్చెన్నాయుడు, కొల్లు రవీంద్ర, గొట్టిపాటి రవికుమార్, నిమ్మల రామా నాయుడు, నారాయణ, మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, వాసంశెట్టి సుభాష్, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్, రామగోపాల్‌రెడ్డి అంత గ్గతంగా సమీక్షించారు. ఆదివారం స్థానిక ఆర్‌అండ్‌బి అతిథి గృహంలో మహానాడు ఏర్పాట్లపై ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఇందులో మహానాడు కార్యక్రమానికి రాష్ట్రం నలుమూలల నుంచి ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, సభకు పెద్దఎత్తున హాజరు కానున్న ప్రజానీకానికి అవసరమైన తీరులో వసతి, వాహన, భోజన, వేదిక ఏర్పాట్లు ఎలా ఉన్నాయనే కోణంలో ఆరా తీశారు. ఈ సందర్భంగా రవాణా శాఖ మంత్రి మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ ఈనెల 27, 28, 28 తేదీల్లో మూడు రోజుల పాటు నిర్వహించే మహానాడు కార్యక్రమానికి రాష్ట్ర నలుమూలల నుంచి విచ్చేసే ప్రజలకు మెరుగైన వాహన సౌకర్యం కల్పిస్తామని చెప్పారు. ప్రతి నియోజకవర్గం నుంచి ప్రత్యేక బస్సు సౌకర్యం కల్పిస్తామని పేర్కొన్నారు. వాహనాలలో వచ్చే వారికి ప్రత్యేక పార్కింగ్‌లు,భోజన వసతులు, తదితర ఏర్పాట్లు పక్కాగా, పకడ్బందీగా నిర్వహిస్తామని చెప్పారు అంతకు ముందు కార్మికశాఖా మంత్రి వాసంశెట్టి సుభాష్, స్వచ్చాంధ్ర మిషన్ ఛైర్మన్ పట్టాభిరాం సభా ప్రాంగణంలో పారిశుధ్య పనుల తీరుపై సమీక్షించారు. మహానాడు ప్రాంగణంలో చేపట్టాల్సిన పారిశుధ్య ఏర్పాట్లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, పారిశుధ్య కార్మికులకు సలహాలు, సూచనలు చేశారు. మధ్యాహ్నానంతరం టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి మద్దిపట్ల సూర్యప్రకాష్ సహా మంత్రులు మహానాడు వేదిక, సభా ప్రాంగణం, పరిసరాలను పరిశీలించారు. ఇదిలా ఉండగా ఈనెల18 నుంచి రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాస రావు అధ్యక్షతన సాగుతున్న మహానాడు వేదిక ఏర్పాట్ల పరిశీలనకు వస్తున్న మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పలువురు కార్పొరేషన్ల ఛైర్మన్లు వరుసగా సమీక్షలు చేస్తుండడం తెలిసిందే.

పన్ను వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించాలి : మంత్రి

ప్రజాశక్తి - కడప అర్బన్

మున్సిపాలిటీల పరిధిలో పన్నుల వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించాలని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి.నారాయణ మున్సిపాలిటీ అధికారులను ఆదేశించారు. ఆదివారం కలెక్టరేట్ లోని విసి హాల్లో ఇంటి పన్నులు, పన్నుల డిమాండ్, అసెస్మెంట్, టౌన్ ప్లానింగ్ అంశాలపై ఉమ్మడి జిల్లా మున్సిపల్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భ ంగా మంత్రి మాట్లాడుతూ నగరపాలక సంస్థ, మున్సిపాలిటీల పరిధిలోని అన్ని విభాగాలు సమన్వయంతో పన్నుల వసూళ్ల కోసం చిత్తశుద్ధితో పనిచే యాలన్నారు. ప్రధానంగా ఆస్తి పన్ను వసూళ్లకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని, ఇందుకోసం ప్రత్యేక ప్రణాళికతో క్షేత్రస్థాయికి వెళ్లాలన్నారు. ప్రతి వార్డుకు సంబంధించి క్లస్టర్ స్థాయిలో పన్నుల జాబితాను, దీర్ఘకాలిక బకాయిల జాబితాను సిద్ధం చేసి, రోజూ డోర్ టు డోర్ వెళ్లాలన్నారు.వార్డు అడ్మిన్ కార్యదర్శులను సమన్వయం చేసుకుని పన్నులు వసూళ్ల వేగవంతం చేయాలన్నారు. పన్నుల వసూళ్లపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. .రాష్ట్ర నిధులపై ఆధారపడకుండా మున్సిపాలిటీల పన్నులను ప్రజలను ఇబ్బం దులకు గురి చేయకుండా వసూలు చేయాలన్నారు. ప్రజలకు కనీస మౌలిక వసతులు కల్పించాలంటే పన్నులు వసూళ్లపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. బయటి అధికారులతో బద్వేల్, కమలాపురం అండర్ అసెస్మెంట్ లపై సర్వే చేయించాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో ప్రధానంగా సాలిడ్ వేస్ట్, డ్రింకింగ్ వాటర్, డ్రైన్లు, రోడ్లు, పార్కులు స్మశానవాటికలు కమ్యూనిటీ హాల్లను ప్రాధాన్యత క్రమంలో అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ముందుగా మున్సిపాలిటీల ఆస్తి పన్నుల వసూళ్ల,జనాభా వివరాలు, మునిపాలిటీ పన్నుల డిమాండ్ లు, మున్సిపాలిటీల వారిగా ఇప్పటివరకు పన్నులు ఎంత వసూలు చేశారు, ఇళ్ల అసెస్మెంట్ వంటి అంశాలపై అధికారులతో చర్చించారు.

మంత్రి 'నిమ్మల'ను కలిసిన ఎన్‌జిఒ నాయకులు

ప్రజాశక్తి - కడప అర్బన్ : నగరంలోని ఇరిగేషన్ అతిథి గృహంలో ఆ శాఖ మంత్రి నిమ్మల రామానాయుడును ఎన్‌జిఒ నాయకులు ఆదివారం మర్యాద పూర్వకంగా కలిశారు. మంత్రిని బొకే, శాలువాతో సన్మానించారు. ఎన్‌జిఒ జిల్లా అధ్యక్షులు బి. శ్రీనివాసులు, సిటి కార్యదర్శి సైలెశ్వేరెడ్డి, ఉపాధ్యక్షులు పద్మనాభం కాటమయ్య మంత్రిని కలిసిన వారిలో ఉన్నారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులు మంత్రితో ఇరిగేషన్ ఉద్యోగుల సమస్యలు, ప్రమోషన్స్‌పై చర్చించారు. మంత్రిగారు సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో, ఇరిగేషన్ అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

యోగాతో ఆరోగ్య భాగ్యం


ప్రజాశక్తి - కడప : దినచర్యలో యోగా ఒక భాగంగా మారితే ఆరోగ్య భాగ్యం సిద్దిస్తుందని కెఎంసి కమిషనర్ మనోజ్‌రెడ్డి పేర్కొన్నారు. .యోగాంధ్ర మహోత్సవాల్లో భాగంగా ఆదివారం ఉదయం కడప ఆర్ట్స్ కళాశాల ఎదుట మాస్టర్ ట్రైనర్లచే యోగాసనాలపై అవగాహన, శిక్షణ ఇచ్చారు. ముఖ్య అతిథులుగా కమిషనర్‌తోపాటు ఆర్‌డిఒ జాన్ ఇర్విన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని "యోగాంధ్ర క్యాంపెన్ -2025 మాసోత్సవాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. యోగా సాధనతో మానసిక సమస్యలకు, శారీరక రుగ్మతల నుండి విముక్తి లభిస్తుందన్నారు. కార్యక్రమంలో తెదనపు కమిషనర్ రాకేష్ చంద్ర, డిపిఒ రాజ్యలక్ష్మి, వివిధ శాఖల జిల్లా అధికారులు, ఆయుష్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎల్‌విపిఇఐ వైటాథాన్ రన్

కడప అర్బన్: ఎల్‌విప్రసాద్ నేత్ర వైద్య విజ్ఞాన సంస్థ ఆధ్వర్యంలో (ఎల్‌విపిఇఐ) రెటినోబ్లాస్టోమా (కంటి కేన్సర్) ముందస్తు గుర్తింపు గురించి అవగాహన కల్పించడానికి, దాని చికిత్స కోసం నిధులను సేకరించడానికి 'వైటాథాన్' రన్ నిర్వహించింది. కడపలోని ఆర్ట్స్ కాలేజీ వద్ద కలెక్టర్ చెరుకూరి శ్రీధర్, జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ నాగరాజు జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం వారు ఈ వ్యాధిపై అవగాహన కల్పించేందుకు ఎల్‌విఇఐ చేపట్టిన కార్యక్రమాన్ని అభినందించారు. వైద్య పరమైన సమస్యలపై తరచూ ప్రజల్లో అవగాహన కలిగించేలా వివిధ కార్యక్రమాల రూపొందించాలని సూచించారు. కార్యక్రమంలో రాజశేఖర రెడ్డి క్యాంపస్ ప్రధాన విభాగపతి డాక్టర్ కావ్య మాధురి బెజ్జం కార్యక్రమంలో 450 మందికి పైగా ఔత్సాహికులు పాల్గొన్నారు.

టిటిడి కౌన్సిల్ సభ్యుడిగా జి.ఎస్.మూర్తి

కడప : జిల్లా కోర్టులో సీనియర్ న్యాయవాదిగా పని చేస్తున్న జి.ఎస్.మూర్తిని తిరుమల తిరుపతి దేవస్థానం లీగల్ కౌన్సిల్ సభ్యుడిగా నియమిస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన 1983 నుంచి తెలుగుదేశం పార్టీలో కీలక కార్యకర్తగా పనిచేస్తూ, తెలుగుదేశం పార్టీలో వివిధ స్థాయిలలో పలు హోదాలో పని చేశారు. జిల్లా కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా వరుసగా మూడు పర్యాయాలు పనిచేశారు. ఇతని పనితనం చూసి తెలుగుదేశం పార్టీలో ప్రత్యేక గుర్తింపు అందజేశారు. పోలీసు ఉన్నతాధికారుల నుంచి ప్రశంసలు అందుకున్నారు. ఉమ్మడి హైకోర్టు న్యాయమూర్తులు కూడా ఆయన పనితనం పైన పలువురు ప్రశంసలు అందజేశారు ఆయన పని తనం గమనించిన తెలుగుదేశం పార్టీ అధిష్టాన వర్గం తిరుమల తిరుపతి దేవస్థానం న్యాయవాదిగా నియమించారు. తన నియామకానికి సహకరించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు, మంత్రి లోకేష్ కు, టిడిపి పొలిట్ బ్యూరో సభ్యుడు రెడ్డప్ప గారి శ్రీనివాస్ రెడ్డి, ఎమ్మెల్యే మాధవికి, ప్రత్యేక కృతజ్ఞతలను తెలియజేశారు. జిఎస్ మూర్తిని టిటిడి కౌన్సిల్‌గా నియమించడంతో జిల్లాలో ఉన్న సీనియర్, జూనియర్ యాగవాదులు హర్షం వ్యక్తం చేశారు.


సిఎంతో జి.ఎస్. మూర్తి

'మహా' జన సమీకరణలో 'దేశం'

- భారీ బహిరంగసభ నిర్వహణకు యత్నం
- ఐదు లక్షల మంది హాజరుపై దృష్టి
- అసెంబ్లీకి 50 వేల చొప్పున టార్గెట్
- రాజంపేట నుంచి భారీగా జనహాజరు



ప్రజాశక్తి - కడప ప్రతినిధి

టిడిపికి రాష్ట్ర మహానాడు నిర్వహణ ప్రతిష్టాత్మకంగా మారింది. జిల్లాలో కరోనా విజృంభిస్తుందనే పేరుతో మహానాడు నిలిపేయాలని వైసిపి కోరుతున్న నేపథ్యం తెలిసిందే. దీంతో అధికార టిడిపి నాయకుల్లో మహనాడు నిర్వహణపై పట్టుదలను మరింత పెంచింది. ఇందులోభాగంగా టిడిపి అధిష్టానం విమర్శల జడవక నిర్వహణ కమిటీలను క్రియాశీలం చేసింది. దీంతో కడప, అన్నమయ్య జిల్లా పార్లమెంట్ ఇన్‌ఛార్జిలపై జన సమీకరణ భారం పడింది. ఇటువంటి పరిస్థితుల నేపథ్యంలో మంత్రుల దగ్గర నుంచి ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ లు, వివిధ కార్పొరేషన్ ఛైర్మన్లు ప్రతిష్టాత్మకంగా తీసుకుని వరుసగా సమీక్షలు నిర్వహిస్తూ మూడ్రోజుల మహానాడు కార్యక్రమాన్ని జయ ప్రదంగా నిర్వహించడంపై మరింతగా దృష్టి కేంద్రీకరించింది.

కడప జిల్లాలో టిడిపి రాష్ట్ర మహానాడు నిర్వహణపై అందరి దృష్టి నిలిచింది. ప్రత్యర్థి నేత వైఎస్ జగన్ సొంత జిల్లాలో మహానాడును జయప్రదం చేసి తీరాల్సిన అనివార్యమైన పరిస్థితి ఏర్పడింది. టిడిపి మహానాడు నిర్వహణలో చిన్నపాటి తప్పిదం దొర్లినా ప్రత్యర్థుల రాజకీయ విమర్శకు ఆయుధాన్ని చేతులారా ఇచ్చినట్లు అవుతుందనడంలో సందేహం లేదు. మహానాడు జయప్రదం కావడంలో ప్రధానంగా జన సమీకరణ అంశమే గీటురాయిగా మార నుంది.

భారీ జన సమీకరణపై కన్ను

ఉమ్మడి కడప జిల్లాలోని 11 అసెంబ్లీలపై జన సమీకరణ కస రత్తు ఊపందుకుంది. ఇందులో ప్రధానంగా కడప, అన్నమయ్య జిల్లా టిడిపి ఇన్‌ఛార్జులు బహిరంగసభకు పెద్దఎత్తున జన సమీకరణ చేయాల్సి ఉంది. ఉమ్మడి కడప జిల్లాలోని 11 అసెంబ్లీ నియోజక వర్గాల నుంచి పెద్దఎత్తున జన సమీకరణ చేయడంపై టిడిపి దృష్టి సారించింది. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి 50 వేల మంది చొప్పున సేకరించాలనే లక్ష్యాన్ని నిర్దేశించింది. ఉమ్మడి కడప జిల్లా లోని కడప, కమలాపురం, మైదుకూరు, ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, పులివెందుల, రాయచోటి, రాజంపేట, రైల్వేకోడూరు అసెంబ్లీల నుంచి 5.50 లక్షల మంది జనాభా సేకరణపై అంచనా వేసుకుంది. ఇందులో కొన్ని నియోజకవర్గాల నుంచి 30 వేలకు జనాభా సేకరణ తగ్గితే, ఆ లోటును భర్తీ చేయడానికి అన్నమయ్య జిల్లాలోని మదనపల్లి, పీలేరు, వాయల్పాడు అసెంబ్లీల నుంచి భర్తీ చేస్తే లక్ష్యాన్ని సులువుగా చేరుకునే అవకాశం ఉందనే ధీమా కనిపి స్తోంది.

జగన్మోహనుని ముద్ర కనిపించేనా

రాజంపేట పార్లమెంట్ ఇన్‌ఛార్జి జగన్మోహన్‌రాజు మహానాడు కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకున్నట్లు కనిపిస్తోంది. కడప జిల్లా జన హాజరుకు ధీటుగా అన్నమయ్య జిల్లా ముద్ర కనిపించేలా కసరత్తు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇందులోనూ రాజంపేట అసెంబ్లీ నుంచి భారీగా జన సమీకరణ చేస్తుండడం గమనార్హం. 2024 సార్వత్రిక ఎన్నికల్లో రాజంపేట, రాయచోటి, మదనపల్లి, పట్టణాల్లోని ఎన్నికల సభలకు అన్నమయ్య జిల్లా నుంచి వందల వాహనాల ద్వారా భారీ జన సమీ కరణ చేసిన సంగతి తెలిసిందే. ఇటువంటి అనుభవం కలిగిన నేపథ్యంలో రాష్ట్ర మహానాడు నిర్వహణలో భాగమైన చివరి రోజు బహిరంగ సభకు ప్రతి అసెంబ్లీ నుంచి 50 వేల మందికి తగ్గని రీతిలో జనాభా సమీకరణలో నిమగ్నమైనట్లు కనిపిస్తోంది.

రాజంపేట నుంచి భారీగా తరలింపు

రాజంపేట నియోజకవర్గ వెహికల్ ట్రాన్స్‌పోర్టు అసోసియేషన్ ఆధ్వర్యంలోని రెండు వేల వాహనాలలో జనాభాను తరలించడానికి ఏర్పాట్లు పూర్తి చేసినట్లు సమాచారం. ఇందులోభాగంగా రాజంపేట పార్లమెంట్ ఇన్‌ఛార్జి జగన్మోహన్‌రాజు ప్రతి గ్రామం, పంచాయతీ, మండలం, నియోజకవర్గ కేడర్‌ను క్రియాశీలం చేయడం గమనార్హం. ఇదేతరహాలో అన్నమయ్య జిల్లాలోని మిగిలిన రైల్వేకోడూరు, మదనపల్లి, పీలేరు, వాయల్పాడు అసెంబ్లీ నియోజకవర్గాల ఇన్‌ఛార్జుల సహకారంతో జన సమీకరణపై దృష్టి సారించినట్లు తెలుస్తోంది. ఏదేమైనా కడప జిల్లా టిడిపి నాయకత్వం జన సమీకరణకు తగ్గకుండా అన్నమయ్య జిల్లా నుంచి భారీగా జనాన్ని తరలించే ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తోంది.

ప్రజలను వైసిపి దగా చేసింది

- జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ

ప్రజాశక్తి - కడప అర్బన్


మాట్లాడుతున్న జ్యోతుల నెహ్రూ

వైసిపి అధికారంలో ఉన్నప్పుడు అన్ని వ్యవస్థలను నిర్వీర్యం చేసి ప్రజలను దగా చేసిందని జగ్గంపేట నియోజకవర్గ శాసన సభ్యులు జ్యోతుల నెహ్రూ పేర్కొన్నారు. రోడ్లు, భవనాల అతిథి గృహంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసిపి నేత పెర్ని నాని మహానాడును దగానాడుగా వ్యాఖ్యానించడం హాస్యాస్పందంగా ఉందన్నారు. మహా నాడు గురించి మాట్లాడే అర్హత లేనివారు కూడా వ్యాఖ్యానించడం తగదన్నారు. నిజంగా ప్రజలను దగా చేసింది ఎవరో ఆత్మ విమర్శ చేసుకోవాలన్నారు. ఐదేళ్ల పాలనలో గుంతలు, గోతులుగా రోడ్లను చేసి దగా చేశారని, అధికారంలోకి రాగానే అవ్వ తాతలకు రూ. 4 వేలు ఇస్తామని, ఐదు వాయిదాలుగా పెన్షన్‌లో దగా చేశారని ఎత్తి చూపారు. నాలుగు వేలు ఇస్తానని చెప్పిన చంద్రబాబు చెప్పిన రోజు నుండి లెక్కలేసి నాలుగు వేలుతో కలిపి ఇచ్చారని ఆయన గుర్తు చేశారు. ఏడాదికి 3 ఉచిత గ్యాస్ సిలిండర్ అమలు చేశామని చెప్పారు. ఇరిగేషన్ ప్రాజెక్టుల పూర్తికి తట్టెడు మట్టి ఎత్తలేదని, రైతు సంక్షేమంపై వైసిపి ఏనాడు దృష్టి సారించ లేదని చెప్పారు.. రైతాంగానికి నీరిచ్చే దిశగా ప్రాజెక్టుల పూర్తికి చంద్రబాబు కృషి చేస్తున్నారన్నారు. సర్పంచులను రోడ్లకు ఎక్కించిన ఘనత వైసిపిదే అన్నారు. గౌరవ సభను కౌరవ సభగా మార్చి స్త్రీని అగౌరవంగా మాట్లాడారు అన్నారు. లిక్కర్ స్కామ్‌లో ఎవరెవరు ఉన్నారో బయటికి వస్తారని, శిక్ష నుండి తప్పించుకోలేరని, లిక్కర్ మనీ ఎక్కడికి చేరింది, అందరికీ తెలుసన్నారు. పేదలకు అందాల్సిన చౌక బియ్యాన్ని సిగ్గు లేకుండా అమ్ముకు తింటారా అని నిలదీశారు. పార్టీ నాయకుడు అరెస్ట్ అయితే పరిస్థితి ఏంటో, తెలుసుకొని పేర్ని నాని మాట్లాడాలని అని హితబోధ చేశారు. సమావేశంలో టిడిపి మీడియా కో- ఆర్డినేటర్ జనార్ధన్ పాల్గొన్నారు.

హజ్ హౌస్ పూర్తిస్థాయిలో ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి - కడప అర్బన్

కడపలో పూర్తిస్థాయిలో హజ్ హౌస్ ఏర్పాటు చేయాలని, రాయలసీమలో యునాని వైద్య కళాశాల నెలకొల్పాలని ముస్లిం సమైక్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు, సామాజిక కార్యకర్త సలావుద్దీన్ కోరారు. ఆదివారం సమైక్య కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హజ్ హౌస్ క్లియరెన్స్ పూర్తి చేసి రవాణా సౌకర్యానికి వీలు కల్పించాలని పేర్కొన్నారు. టిడిపి అధికారంలో ఉన్నప్పుడు కడపలో హజ్ హౌస్ ఏర్పాటు చేశారన్నారు. అందులో సివిల్ పనులు పూర్తి కాలేదని అవి పూర్తి చేసి రాయలసీమ హాజీలను ఉపయోగకరంగా చేయాలని కోరారు. రాయచోటిలో దాదాపు పది ఎకరాలలో విస్తీర్ణం గా ఉన్న యునాని మెడికల్ కళాశాలను రెవెన్యూశాఖ తగిన విధానంతో కేటాయించాలని, మున్సిపల్ ఆమోదం పెండింగ్ ఉందన్నారు. రాష్ట్ర విభజన తర్వాత విద్య ఇతర సంస్థల కేటాయింపులో జాప్యం ఎపికి అన్యాయం చేస్తున్నారని తెలిపారు. అండర్ గ్రాడ్యుయేట్, పోస్ట్ గ్రాడ్యుయేట్ యునాని వైద్య సంస్థ శిథిలావస్థకు చేరుకుందని తెలిపారు. కొత్త యునాని స్థాపనకు రూ.50 కోట్ల సహాయం అందించడానికి కేంద్ర ప్రభుత్వం అంగీకరించిందన్నారు. ఆయుష్ యునాని ఇప్పటికే కమిషన్ ద్వారా ఏపీ రాష్ట్రం నుంచి తగిన ప్రతిపాదన కోసం వేచి ఉందన్నారు. ఇది సులభంగా చేపట్టొచ్చో అన్నారు. ముఖ్యమంత్రి, ఆరోగ్య శాఖ మంత్రి, టిడిపి రాయలసీమ నాయకులను తాము అభ్యర్థిస్తున్నామన్నారు. కడపలో జరగబోయే మహానాడు కార్యక్రమంలో పేద ప్రజల ప్రయోజనాల కోసం న్యాయమైన డిమాండ్లను పరిగణించాలని ప్రత్యేకంగా కోరుకున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో డాక్టర్ ఖాలిల్లుల్లా, నవాజ్ వుల్లా పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సలావుద్దీన్

మెరుగైన సేవలందించడమే లక్ష్యం

కార్గో సేవల మెరుగుదలకు కృషి
కారుణ్య నియామకాలకు ఆమోదం
జిల్లా ప్రజా రవాణా అధికారి పి.గోపాల్‌రెడ్డి వెల్లడి



ముఖా ముఖి..

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

ప్రయాణికులకు మెరు గైన సేవలను అందించడమే ప్రజా రవాణా సంస్థ ధ్యేయం. ఆర్‌టిసి ఆదాయాన్ని పెంచుకో వడంలో భాగంగా కార్గో సేవలపై దృష్టి సారించాం. కార్గో ఇచ్చిన స్ఫూర్తితో రీజినల్ మేనేజర్ స్థాయి నుంచి ఇన్‌స్పెక్టర్ స్థాయి అధికారుల వరకు నిరంతరం పర్యవేక్షిస్తాం. దీనికితోడు దూర ప్రాంతాలకు వెళ్లే వాహనాలను ఆర్‌ఎం బృందం వారానికోసారి ర్యాండమ్‌గా తనిఖీలు చేస్తోంది. ఫలితంగా కండిషన్ సక్రమంగా ఉండడం, డీజిల్ వినియోగం తక్కువగా ఉండడం, విడిభాగాలు వంటి ఖరీదైన వ్యవహారాలను అదుపులో ఉంచే ప్రయత్నం కొనసాగుతోంది. దీనికితోడు ప్రయాణి కులతో దురుసుగా ప్రవర్తించిన కార్మికులకు శిక్షణ, మెళకువలను నేర్పడం వంటి శిక్షణా తరగతులను నిర్వహిస్తున్నాం. ప్రజా రవాణా సంస్థ ఆదాయాలను పెంచుకునేందుకు ఉద్దేశించి పొరుగు రాష్ట్రాల్లోని అరుణాచలం, వేలాంగిణి, గోవా, షిర్డీ, అయోధ్య వంటి ప్రసిద్ధ ప్రార్థనా ప్రదేశాలకు రవాణా సదు పాయాలను అందిస్తున్నామని పేర్కొంటున్న జిల్లా ప్రజా రవాణా అధికారి పి.గోపాల్‌రెడ్డితో ముఖా ముఖి...

కార్గో ఆదాయ వివరాలను తెలపండి?

జిల్లా కార్గో ఆదాయాన్ని గణనీయంగా పెంచే ప్రయత్నం చేస్తున్నాం. గతేడాది రూ.9.77 కోట్లు సాధించగా, ఈఏడాది రూ. 10.68 కోట్లు లభించింది. గతేడాదితో పోలిస్తే రూ.70 లక్షలు ఆదాయం పెరిగింది. ఈఏడాది మరింత దృష్టి కేంద్రీకరించడం ద్వారా మరింత ఆదాయం పెంచుకోవడంపై ప్రధానంగా దృష్టి సారించాం.

ప్రజా రవాణా సంస్థ సేవల గురించి తెలపండి?

ప్రజా రవాణా సంస్థ లాభాపేక్ష రహితంగా ప్రయాణికులకు సురక్షిత, మెరుగైన సదుపాయాలను అందుబాటులో ఉంచుతోంది. జిల్లాలోని మారుమూల ప్రాంతాల నుంచి నిత్యం వందలాది విద్యా సంస్థల్లో విద్యాభ్యాసం చేస్తున్న వేలాది మంది విద్యార్థులు, వికలాంగులు, వృద్ధులకు రాయితీతో పాసులు, టికెట్లు మంజూరు చేస్తున్నాం.

డిపోల స్థితిగతుల గురించి చెప్పండి?

జిల్లాలో ఆరు డిపోలున్నాయి. ఇందులో 2,210 మంది రెగ్యులర్ ఉద్యోగులున్నారు. ఇందులో కడప, మైదుకూరు, ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, పులివెందుల, బద్వేల్ పట్టణాల్లో డిపోలున్నాయి. ఇందులో కిలో మీటరుకు అత్యధికంగా రూ.3.60 తగ్గింది. అత్యల్పంగా జమ్మమడుగు డిపో కిలోమీటరుకు రూ.43 చొప్పన తగ్గింది.

లాభార్జన ప్రణాళిక ఏమైనా ఉందా?

ప్రజా రవాణా సంస్థను లాభాలబాట పట్టించడానికి అవసరమైన కసరత్తు చేపట్టాం. ఇందులో ప్రతినెలా సంతోష వారోత్సవాలు నిర్వహిస్తున్నాం. డీజిల్ ఆదాపై డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్నాం. రద్దీ రహదారుల్లో ప్రయాణికులకు డిపోల వారీగా బహుమతులు అందించడం, ప్రయాణ ప్రాంగణాల్లోని బస్సులను రీజినల్ మేనేజర్ స్థాయి నుంచి ఇన్‌స్పెక్టర్ స్థాయి అధికారులతో కూడిన నిపుణుల కమిటీ ర్యాండమ్‌గా తనిఖీలు చేపట్టడం జరుగుతోంది.

బస్సుల వివరాలు తెలపండి?

ప్రజా రవాణా సంస్థ 611 బస్సులు నడుపుతోంది. రోజూ 2.20 లక్షల కిలోమీటర్ల మేర పరుగులు తీస్తున్నాయి. ఇందులో 11 ఇంద్రా, 04 అమరావతి, 04 స్టార్‌లైన్, ఎస్‌ఎల్ 11, 92 సూపర్ లగ్జరీ, 29 అల్ట్రా డీలక్స్, 113 ఎక్స్‌ప్రెస్, 59 అల్ట్రా పల్లె వెలుగు, 288 పల్లెవెలుగు బస్సులను ఏర్పాటు చేశాం.

కార్మికుల సంక్షేమానికి తీసుకుంటున్న చర్యలేమిటి?

సూపర్‌స్పెషాలిటీ హాస్పిటల్ సేవలు అందిస్తున్నాం. సకాలంలో నాణ్యమైన వైద్య సేవలను అందిస్తున్నాం. హెల్త్ స్కీమ్‌ను అమలు చేస్తున్నాం. సాధారణ మరణానికి రూ.ఐదు లక్షలు, ప్రమాద మరణానికి రూ.1.10 లక్షల వరకు బీమా సదుపాయం కల్పించాం. ఇటీవల జమ్మలమడుగు డిపోకు చెందిన ఓ కండక్టర్‌కు బీమా సదుపాయం వర్తించింది.

రిక్రూట్‌మెంట్ల గురించి తెలపండి?

త్వరలో 62 కారుణ్య నియామకాలు చేపట్టనున్నాం. కలెక్టర్ ఆదేశాలు అందిన వెంటనే నియామకాలకు సంబంధించిన కసరత్తు చేపడతాం. 2016 నుంచి 2019 వరకు 54 మందికి, 2015 ముందు 30 మందికి, 2020 నుంచి 2023 నాటికి 96 మందికి కారుణ్య నియామకాలు చేపట్టడమైంది.



నూతనంగా ఎన్నికైన బిసి కమిటీ సభ్యులు

బిసి జిల్లా యువజన అధ్యక్షుడిగా చల్లా బాలాజీ

ప్రజాశక్తి - వేంపల్లె

జాతీయ బిసి సంక్షేమ సంఘం యువజన అధ్యక్షుడిగా చల్లా బాలాజీ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బిసి సంక్షేమ సంఘం జిల్లా నూతన కమిటీ ఎన్నికల్లో భాగంగా ఆదివారం వేంపల్లెలో జాతీయ బిసి సంక్షేమ సంఘం సమావేశం రాష్ట్ర అధ్యక్షులు వనమాల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. జిల్లా గౌరవ అధ్యక్షుడుగా బత్తల ఆదినారాయణ, జిల్లా యువజన అధ్యక్షుడుగా చల్లా బాలాజీ, సంయుక్త కార్యదర్శిగా బత్తల చలపతి, జిల్లా ప్రచార కమిటీ చైర్మన్‌గా ఎం.నాగేశ్వరావు, జిల్లా కమిటీ సభ్యుడుగా వెంకటసుబ్బయ్య, పులివెందుల నియోజకవర్గ గౌరవ అధ్యక్షులుగా వి.రత్నయ్యను ఎన్నుకున్నారు. పులివెందుల నియోజకవర్గ అధ్యక్షులుగా బుజ్జబాబు, ఉపాధ్యక్షులుగా వి.రామచంద్ర, పులివెందుల నియోజకవర్గం ప్రచార కమిటీ చైర్మన్‌గా ఎం.గంగాధర్, వేంపల్లె మండలం అధ్యక్షుడుగా వల్లపు వెంకటసుబ్బయ్య, ఉపాధ్యక్షుడుగా జి.భాస్కర్ రెడ్డిను నియమించారు. వీరికి నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు వనమాల శ్రీనివాస్ మాట్లాడుతూ బిసిలకు కేంద్రంలో బిసి మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని కోరారు. బిసి రక్షణ చట్టం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లాలో ఉన్న అన్ని బిసి కులాలను కలుపుకొని ఐక్యతతో బిసి కులాల అభివృద్ధికి పాటుపడాలని కోరారు. చిత్తూరు జిల్లాలో బిసి పేటేం చేయడానికి కృషి చేస్తామన్నారు. సమావేశంలో రాష్ట్ర ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ ఎన్. సురేంద్రరాజిరెడ్డి, ఆర్‌సిడిఎస్ మంచారి వెంకటసుబ్బారెడ్డి, వేంపల్లె వడ్డెర సంఘం అధ్యక్షులు మల్లె సంటన్న, గంగుల మల్లికార్జున, బిసి కులాల నాయకులు పాల్గొన్నారు.



ఆత్మీయ సమ్మేళనంలో ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

- పాఠశాలకు రూ.50 వేలు వితరణ

ప్రజాశక్తి - ముద్దనూరు

ముద్దనూరు బాలుర ఉన్నత పాఠశాలలో 1989-90 సంవత్సరంలో పదవ తరగతి చదువుకున్న విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. ఆనాటి ఉపాధ్యాయులు రాజబాబు, ప్రసాద్, మాబు, భారతి, రమాదేవిని సన్మానించారు. ఈ సందర్భంగా ఉపా ధ్యాయులు, విద్యార్థులు ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుంటూ.. ఆనాటి మధుర జ్ఞాపకాలను స్మరించుకున్నారు. అనంతరం పాఠశాల అభివృద్ధికి తమ వంతు సాయంగా రూ.50వేలు నగదు వితరణ చేయనున్నట్లు పూర్వ విద్యార్థులు ప్రకటించారు. ఉపాధ్యాయులు మాధవరెడ్డి, అన్వర్ బాషా పాల్గొన్నారు.

మోడల్ డిఎస్‌సి పరీక్షను సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో ఈనెల 28న జరిగే మోడల్ డిఎస్‌సి పరీక్షను నిరుద్యోగ అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని ఎంఇఒ చంద్రశేఖర్ కోరారు. మోడల్ డిఎస్‌సి పరీక్ష కరపత్రాన్ని స్థానిక ఎంఇఒ కార్యాలయంలో ఆదివారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంఇఒ మాట్లాడుతూ మోడల్ డిఎస్‌సి పరీక్ష నిర్వహిస్తున్న డివైఎఫ్ఐకి అభినందనలు తెలిపారు. జమ్మలమడుగు ఎస్వీ డిగ్రీ కాలేజీలో, బద్వేలు గౌతం కాలేజీలో పరీక్ష నిర్వహిస్తున్నారు. అభ్యర్థులు రూ.50ఎంట్రీ ఫీజు చెల్లించి తమ పేర్లను నమోదు చేసుకోవాలి. సంప్రదించాల్సిన ఫోన్ నెంబర్లు కడప 99127 58515, ప్రొద్దుటూరు 80080 87023, జమ్మలమడుగు 99127 58515, 91009 95538, బద్వేలు 90594 14222 సంప్రదించాలని నిర్వాహకులు కోరారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరనాల శివ కుమార్, పట్టణ ఉపాధ్యక్షులు సుభాన్, నాయకులు కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

ప్రమోషన్లలో పారదర్శకతను పాటించాలి

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

ప్రస్తుతం ఉమ్మడి కడప జిల్లాలో జరుగుతున్న ప్రధానోపాధ్యాయ ప్రమోషన్లలో పారదర్శకతను పాటించాలని కడప జిల్లా మాదిగ ఉద్యోగుల సమాఖ్య జిల్లా అధ్యక్షులు పిచ్చికె బాబు మాదిగ డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక ఎన్జీఓ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ అధికారులు ప్రమోషన్లలో ప్రతిసారి అడక్వెన్సీ పేరుతో ఎస్సీల 15శాతం కోటాను తగ్గించే ప్రయత్నం చేయడం దారుణమన్నారు. ఎస్సీల కోటా ఏరకంగా అడిక్వెన్సీకి చేరిందో పూర్తి వివరాలతో రిజర్వేషన్ల వారీగా వెల్లడించాలన్నారు. ప్రధానోపాధ్యాయుల హోదాతో సమానమైన ఎంఇఒ - 2 పోస్టులను సైతం టోటల్ క్యాడర స్ట్రెంత్‌గా లెక్కించాలన్నారు. ప్రస్తుతం జరుగుతున్న ప్రధానోపాధ్యాయ ప్రమోషన్లలో ఎస్సీల ఉప వర్గీకరణ కోటాను ఏ విధంగా భర్తీ చేస్తారో బహిర్గత పరచాలని కోరారు. ఎస్సీలకు అన్యాయం జరిగితే సహించేది లేదన్నారు. సమానత్వం కోసం ఎస్సీ వర్గీకరణను స్పష్టంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఆ మేరకు సోమవారం కలెక్టర్, డిఇఒ, ఆర్‌జెడిని కలవనున్నట్లు పేర్కొన్నారు.

వృద్ధ దంపతులకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల



ఆర్థికసాయం, సరుకులను అందిస్తున్న మానవత సభ్యులు

మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో స్థానిక వృద్ధ దంపతులు పులికేటి శీను, వెంకటలక్ష్మికి ఆదివారం గౌతమ్ హైస్కూల్‌లో రూ.7వేలు ఆర్థిక సాయం అందజేశారు. నిత్యావసర సరుకులు అందజేశారు. నెల వారి మానవత సమావేశాన్ని చైర్మన్ రఘురామిరెడ్డి అధ్యక్షతన నిర్వ హించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన మాజీ సర్పంచ్ సానేపల్లి రవిప్రసాద్‌రెడ్డిని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా రవిప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ మానవత ఆధ్వ ర్యంలో సామాజిక సేవ కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. సేవల్లో తాను భాగస్వామ్యం అవుతానని, సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు. కార్యక్రమంలో జక్కు చెన్నకృష్ణారెడ్డి, నిడిజీ రాజారెడ్డి, మక్బుల్, మధుసూదన్ రెడ్డి, రాఘవరెడ్డి, మానవత సభ్యులు పాల్గొన్నారు.

రాజీవ్ నగర్‌లో తాగునీటి పైప్‌లైన్ పనులు

ప్రజాశక్తి - వేంపల్లె



వేంపల్లె గ్రామ పంచాయతీ పరిధిలోని రాజీవ్ నగర్ కాలనీలో తాగునీటి పైప్ లైన్ పనులు చేపట్టారు. ఇటీవల కాలంలో రాజీవ్‌నగర్ కాలనీలో తాగునీటి ఇబ్బందులు ఉన్నాయని, ఆ ప్రాంత ప్రజలు సర్పంచ్ దృష్టికి తెచ్చారు. ఈ నేపథ్యంలో ఆదివారం సర్పంచ్ రాచినేని శ్రీనివాసులు ఆదేశాలు మేరకు పంచాయతీ సిబ్బంది పనులు చేశారు. నీటి ఎద్దడి నివారణకు సర్పంచ్ పైప్‌లైన్ వేయడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

రేషన్‌షాపు వద్దే సరుకులు పంపిణీ

ఉపాధి కోల్పోతామని ఎండియు వాహనదారుల్లో ఆందోళన

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

జూన్ ఒకటి నుంచి లబ్ధిదారులు రేషన్‌షాపు వద్దకెళ్లి సరుకులు తీసుకోవాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. ఎండియు వాహనాల ద్వారా సరుకులు డోర్ డెలివరి చేయడాన్ని కూటమి ప్రభుత్వం రద్దు చేసింది. ఈ నేపథ్యంలో ఎండియు వాహనదారులు ఉపాధి కోల్పోతున్నామని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జూన్ 1నుంచి నుంచి ఇంటింటా సరుకుల పంపిణీని నిలిపేస్తున్నామని పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ప్రకటించారు. ఇకపై కార్డుదారులు నేరుగా రేషన్ షాపులకు వెళ్లి సరుకులు తెచ్చు కోవాల్సిందేనని స్పష్టం చేశారు. 65 ఏళ్లు దాటిన వారు, విభిన్నప్రతిభావంతులకు మాత్రమే ఇంటికి సరుకులు పంపిణీ చేస్తామని తెలిపారు. గత వైసిపి ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేసిన ఎండియు వాహనాల ద్వారా డోర్ డెలివరి విధానాన్ని కూటమి ప్రభుత్వం పది నెలలుగా కొనసాగిస్తూ వచ్చింది. కూటమి సర్కారు ఏర్పడిన కొత్తలో డోర్ డెలివరి విధానం తొలగించాలని భావించినప్పటికీ ప్రజల నుంచి వ్యతిరేకత వ్యక్తమయ్యే అవకాశం ఉందని భావించి వెనక్కి తగ్గింది. జిల్లా వ్యాప్తంగా 5,78,685 రేషన్ కార్డులున్నాయి. వీటి పరిధిలో 15,68,969 మంది లబ్ధిదారులు ఉన్నారు. జిల్లా వ్యాప్తంగా 1,239 రేషన్ షాపులున్నాయి. రేషన్ డీలర్లకు కమిషన్ చెల్లిస్తూ వారి ఉపాధికి భంగం లేకుండా డోర్ డెలివరీ విధానం ద్వారా ఇంటింటికీ రేషన్ సరుకులు సరఫరా చేస్తున్నారు. జిల్లాలో రేషన్ సరుకులు అందించేందుకు రెండు, మూడు దుకాణాలకు ఒక వ్యాన్ ప్రకారం 366 వ్యాన్‌లను ఏర్పాటు చేశారు. గడిచిన ఐదు సంవత్సరాల నుంచి ప్రజలు కూడా ఈ విధానానికి అలవాటు పడ్డారు. ఈ తరుణంలో మళ్లీ ఈ విధానాన్ని తొలగించి చౌక ధరల దుకాణాలను తెరపైకి తెస్తున్నట్లు సర్కారు ప్రకటించడం విమర్శలకు తావిస్తోంది. రేషన్ సరుకుల కోసం గతంలో రేషన్ దుకాణాల వద్ద జనాలు పడిగాపులు కాయాల్సి వచ్చేది. ఐదేళ్ల నుంచి ప్రజలకు ఆ కష్టాలు



ఎండియు వాహనం ద్వారా రేషన్ పంపిణీ(ఫైల్‌ఫొటో)

తప్పాయి. ఇప్పుడు డోర్ డెలివరీ వాహనాలను తొలగించడం కారణంగా మళ్లీ కార్డుదారుల కష్టాలు షరా మామూలు కానున్నాయ. జిల్లాలో 366 మంది ఎండియు ఆపరేటర్లు కూటమి సర్కారు నిర్ణయం వల్ల ఉపాధి కోల్పోనున్నారు. వాహనదారుడే రేషన్ అందించేలా ఏర్పాటు చేసి గత సర్కారు ఉపాధి కల్పించింది. ఆటో కొనుగోలు అయ్యే ఖర్చులో 60 శాతం ప్రభుత్వ రాయితీ, 30 శాతం బ్యాంకు రుణంగా, పది శాతం లబ్ధిదారుడి వాటాగా వాహనాలను సమకూర్చారు. ఒకో యూనిట్ విలువ రూ.5,81,190గా నిర్ణయించారు. జిల్లా వ్యాప్తంగా రూ.21.15 కోట్ల విలువైన వాహనాలను ఎస్‌సి, ఎస్‌టి, బిసి, ఇబిసి కార్పొరేషన్ల ద్వారా లబ్ధిదారులకు అందించారు. బ్యాంకు రుణం 30శాతం చెల్లిస్తే తిరిగి వాహనాలను లబ్ధిదారునికే చెందేలా చర్యలు తీసుకున్నారు. ఆటో, వ్యాన్ ఆపరేటర్‌కు ఈ విధానం ద్వారా ఉపాధి కల్పించారు. ఇందుకోసం ఎండియు ఆపరేటర్‌కు నెలకు రూ.18వేలు చొప్పున వేతనం కూడా అదిస్తున్నారు. వ్యాన్ ద్వారా ఆయా వీధుల్లో ఇళ్ల దగ్గరకు వెళ్లి సరుకులు అందిస్తున్నారు. ఇప్పుడు జిల్లా వ్యాప్తంగా 366 వాహనదారుల ఉపాధిని ప్రభుత్వం ప్రశ్నార్థకంగా మార్చింది. ఈ వాహనాలు సరుకుల సరఫరా నిమిత్తం ప్రత్యేకంగా తయారు చేయించడం కారణంగా ఇతర అవసరాలకు వినియోగించే అవకాశం లేదు. అలా వినియోగించుకోవాలన్నా ఖర్చుతో కూడుకున్నది కావడంతో ఎండియు ఆపరేటర్లు తలలు పట్టుకుంటున్నారు. గతంలో చౌకధరల దుకాణం (రేషన్ షాపులు) ద్వారా రేషన్ పంపిణీ చేసేవారు. అయితే వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత అప్పటి సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి కీలక నిర్ణయం తీసుకున్నారు. రేషన్ సరుకుల కోసం షాపుల వద్ద నిరీక్షించాల్సిన అవసరం లేకుండా రేషన్ సరుకులు డోర్ డెలివరీ చేయాలని నిర్ణయించారు. అందులో భాగంగా మొబైల్ డిస్పెన్సింగ్ యూనిట్స్ వాహనాల ద్వారా రేషన్ పంపిణీని 2021 జనవరి 21న వైఎస్ జగన్ ప్రారంభించారు. 2021 ఫిబ్రవరి ఒకటో తేదీ నుంచి రాష్ట్రవ్యాప్తంగా 9,260 వాహనాలను ఉపయోగించి రేషన్ కార్డుదారులకు నేరుగా ఇంటి వద్దకే నాణ్యమైన బియ్యం, ఇతర సరుకులను అందజేస్తూ వచ్చారు.

ప్రభుత్వం పునరాలోచన చేయాలి

కూటమి ప్రభుత్వం తీసుకున్న ఎండియు వాహనాల వద్దు విషయంలో పునరాలోచన చేయాలని వాహనదారులు కోరుతున్నారు. ప్రతినెల ప్రభుత్వం రూ.18 వేలు చెల్లిస్తుందని, ఇందులో రూ.3000 వాహనపు కంతు చెల్లించాలి. మొత్తం ఐదు సంవత్సరాలు కంతు కట్టాల్సి ఉండగా ఇంకా 10 నెలల పాటు చెల్లించాలి. ఇలా రద్దు చేస్తే ఆ వాహనాలను ఏం చేయాలి అని ఆపరేటర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వాహనాలను ప్రభుత్వ అవసరాలకు వాడుకోవాలి

ఏదైనా ప్రభుత్వానికి సంబంధించిన వాటికి ఎండియు వాహనాలను వాడుకుంటే ఉపాధి కోల్పోకుండా ఉంటాం. కంతులు కూడా కట్టుకోవడానికి వీలవుతుంది. ప్రభుత్వం ఆలోచించి నిర్ణయం తీసుకోవాలి.

- మోహన్ రెడ్డి, ఎండియు వాహనదారుడు పులివెందుల

కొనుగోలులో రైతులు జాగ్రత్తలు తీసుకోవాలి

ప్రజాశక్తి - చాపాడు

ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావడం, వర్షాలు కూడా అడపదడప పడుతూ భూములు పదును కావడంతో రైతులు వ్యవసాయ పనులకు సిద్ధపడుతున్నారు. దుక్కులతోపాటు ఎరువులు, విత్తనాలు కొనుగోలు చేపడుతున్నారు. వీరి అవసరాన్ని అదనుగా చేసుకుని వ్యాపారులు మాయ మాటలతో నాసిరకం విత్తనాలు, సస్యరక్షణ మందులను అంటగడుతూ సొమ్ము చేసుకుంటున్నారు. గతంలో చాలా చోట్ల నాసిరకం విత్తనాలతో పంటలో ఎదుగుదల లేక రైతులు ఆర్థికంగా నష్టపోయిన సంఘటనలు చోటుచేసుకున్నాయి. గతంలో తిప్పిరెడ్డిపల్లె, వెదురూరు, రాజుపాలెం, వీరభద్రపురం తదితర గ్రామాల్లో నకిలీ వడ్ల విత్తనాలతో రైతులు తీవ్రంగా నష్టపోయిన సంఘటనలు ఉన్నాయి. ఆ సంఘటనలు పునరావృతం కాకుండా విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల కొనుగోలు సమయంలో అప్రమత్తంగా ఉండాలని వ్యవసాయ అధికారి మ్యాగీ సూచిస్తున్నారు. గుర్తింపు పొందిన తయారీ సంస్థల నుండి విత్తనాలు, ఎరువులు, మందులు కొనుగోలు చేయాలని సూచిస్తున్నారు. ఏదైనా సమస్య వస్తే కంపెనీ దృష్టికి తీసుకు వెళ్లి నష్టపరిహారం పొందే అవకాశం ఉంటుందన్నారు. ఎలాంటి వివరాలు లేకుండా ఇచ్చే వాటిని కొనుగోలు చేయడం వల్ల అనేక సమస్యలు తలెత్తుతాయని, ముఖ్యంగా కొనుగోలు సందర్భంలో వ్యాపారుల నుంచి తప్పకుండా రసీదు తీసుకోవాలని అధికారులు పేర్కొంటున్నారు. నష్టం వాటిల్లిన సందర్భంలో వారిపై కేసు నమోదు చేయించి రైతులకు పరిహారం అందించేందుకు అవకాశం ఉంటుందన్నారు. రసీదు పొందకపోతే రైతుకు ఎలాంటి ఆధారం ఉండదన్నారు. విత్తనాల విషయంలో మరింత జాగ్రత్తలు పాటించాలని పేర్కొంటున్నారు. విత్తే ముందు మొలక శాతం పరీక్షిం చుకోవడం వల్ల నాణ్యత ముందుగానే తెలుసుకోవచ్చునని, తద్వారా విత్తనాల



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఎఒ మ్యాగీ (ఫైల్‌ఫొటో)

నాణ్యతను నిర్ధారించుకోవచ్చంటున్నారు. విత్తనాలు కొనుగోలు సందర్భంలో సంచులపై ఉండే వివరాలను క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. సీల్ నెంబర్, కాలపరిమితి తప్పనిసరిగా సరిచేసుకోవాలని, లేని వాటిని గుర్తించాలని పేర్కొంటున్నారు. కొనుగోలు చేసిన తర్వాత బిల్లులను పంట కాలం పూర్తయ్యే వరకు జాగ్రత్తగా ఉంచుకోవాలని సూచిస్తున్నారు. పురుగు మందుల కొనుగోలు సందర్భంలో ఐఎస్ఐ నెంబర్ ఉన్న వాటిని కొనుగోలు చేయడం మంచిదని సూచిస్తున్నారు. వ్యవసాయ అధికారుల నుంచి అనుమతి కలిగిన దుకాణాల్లో మాత్రమే కొనుగోలు చేయాలని పేర్కొంటున్నారు. ఎరువులు, మందులు, విత్తనాలు కొనుగోలు సమయంలో వ్యవసాయ అధికారుల సూచనలు పాటించడం వల్ల చాలా వరకు ఉపయోగకరమని సూచిస్తున్నారు. సేకరించిన విత్తనాలు, ఎరువుల నాణ్యతను ల్యాబ్‌లో పరీక్షించుకోవాలని అధికారులు రైతులకు సూచిస్తున్నారు.

జీవితాల్లో అనేక కథలు దాగున్నాయి : బాలాజీ



జ్ఞాపికను అందజేస్తున్న జెవివి నాయకులు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

జీవితాల్లో అనేక కథలు దాగున్నాయని, వాటిని కథల్లో చెప్పగలిగితే సమాజాన్ని ప్రభావితం చేయవచ్చని రాష్ట్ర తెలుగు భాష పురస్కార అవార్డు గ్రహీత పలమనేరు బాలాజీ అన్నారు. జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో పిల్లల కథ వర్క్‌షాప్ కథా వసంతం-25 రెండవ రోజు కార్యక్రమం స్థానిక జెవివి కార్యాలయంలో ఆదివారం నిర్వహించారు. కార్యక్రమంలో 'కథల్లో సామాజిక సంబంధాలు' అనే అంశంపై బాలాజీ మాట్లాడుతూ.. పుస్తకం మనిషిలోని ఆలోచనలను మారుస్తుందని, తద్వారా సమాజంలో మార్పును తీసుకురావచ్చని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ తమలోని చలనం ద్వారా వారిలోని సృజనను బతికించుకోవాలన్నారు. జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కార్య దర్శి పబ్లికేషన్స్ కన్వీనర్ డాక్టర్ దార్ల బుజ్జిబాబు కథలో తార్కిక దృష్టి అనే అంశంపై మాట్లాడుతూ.. కాల్పనిక సాహిత్యంలో కథా రచన చేసే సమయంలో తార్కికతకు అందని ఊహలు కథ చెప్పేందుకు ఉపకరిస్తాయని తెలిపారు. కథల్లో ప్రధాన అంశాన్ని చెప్పేందుకు తోడ్పడే ఊహలో తార్కికతను కాక కథాంశం నెరవేర్చే ప్రయోజనం చూడాలని సూచించారు. జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కమిటీ సభ్యులు పి.విజయ పిల్లలకు పప్పెట్ షోల ద్వారా దురాశ దుఃఖానికి చేటు, నాన్న పులి అనే రెండు కథలు ప్రదర్శిస్తూ విజువలైజేషన్ ఎలా చేయవచ్చో వివరించారు. పప్పెట్ షో ద్వారా పిల్లలు ఆలోచనలను వారిలోని సృజనాత్మకతను పెంపొందించవచ్చు అన్నారు. కథా రచయిత, రేడియో, టెలివిజన్ ప్రెజంటర్ మాధవికళ మాట్లాడుతూ పిల్లల విజువలైజేషన్ను కామిక్స్ పిల్లలకు ఎలా అలవాటు చేయగలవో వివిధ కామిక్ పాత్రల ద్వారా సోదాహరణంగా వివరించారు. జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి తవ్వా సురేష్ మాట్లాడుతూ కథా వసంతం విజయవంతం అయ్యేందుకు కృషి చేసిన వారందరికీ ధన్యవాదాలు తెలిపారు. జన విజ్ఞాన వేదిక గౌరవ సలహాదారు డాక్టర్ మురుకుటి సూర్యనారాయణరెడ్డి విచ్చేసిన రచయితలకు జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో కవి కాశీ వరపు విరసం వరలక్ష్మి, జెవివి జిల్లా ఉపాధ్యక్షుడు మురళి గుప్తా, జిల్లా నాయకులు రాజేష్, శిరీష, వేంపల్లి రాజశేఖర్, ఉషారాణి, మధుసూదన్ రెడ్డి, మీనా, దేవానంద్, జుబేద భరత్, నరసింహ, గౌతమ్ సోయా, గురు పాల్గొన్నారు.

రోడ్డు పూర్తయితేనే మార్కెట్‌కు అనుకూలం

ప్రజాశక్తి - సింహాద్రిపురం

మండలంలోని గురజాల-వెన్నపూసపల్లె గ్రామాల మధ్య ఏర్పాటు చేస్తున్న తార రోడ్డు నిర్మాణ పనులను పంచాయతీరాజ్ డిఇఇ రాంప్రసాద్‌రెడ్డి పరిశీలించారు. ఆదివారం తార రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించి, పలు సూచనలు చేశారు. రోడ్డు నాణ్యత విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదన్నారు. దాదాపు రూ.3.5 కోట్ల వ్యయంతో ఐదు కిలోమీటర్ల తార రోడ్డు ఏర్పాటు చేశామన్నారు. తద్వారా రెండు గ్రామాలతోపాటు మరికొన్ని గ్రామాలకు ఎంతో ఉపయోగకరమన్నారు. ముఖ్యంగా పండ్ల తోటల రైతులు తమ ఉత్పత్తులను మార్కెట్‌కు తరలించడానికి ఎంతో ఉప యోగ కరమన్నారు. కార్యక్రమంలో ఎఇ బాలాజీ నాయక్ పాల్గొన్నారు.



పనులను పరిశీలిస్తున్న డిఇఇ రాంప్రసాద్ రెడ్డి

ఎన్‌టిఆర్ ఆశయాలకు దూరమవుతున్న టిడిపి



మాట్లాడుతున్న పిసిసి అధికార ప్రతినిధి తులసిరెడ్డి

ప్రజాశక్తి - వేంపల్లె

తెలుగుదేశం పార్టీ రోజురోజుకూ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు నందమూరి తారక రామారావు ఆశయాలకు, ఆదర్శాలకు దూరమవుతోందని పిసిసి అధికార ప్రతినిధి డాక్టర్ ఎన్.తులసిరెడ్డి విమర్శించారు. ఆదివారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ తెలుగు భాష, తెలుగు జాతి, తెలుగు వారి ఆత్మ గౌరవం కోసం ఆనాడు ఎన్‌టిఆర్ రాజకీయ పార్టీని స్థాపించారని గుర్తు చేశారు. పార్టీ పేరును కూడా తెలుగుదేశం అని పెట్టారని తెలిపారు. దురదృష్టవశాత్తూ చంద్రబాబు పాలనలో పాఠశాల విద్యలో తెలుగు మాధ్యమం లేదన్నారు. తొలి భాషా ప్రయుక్త రాష్ట్రంగా ఏర్పాటైన ఆంధ్ర ప్రదేశ్‌లో పాఠశాల విద్యలో తెలుగు మాధ్యమాన్ని రద్దు చేస్తూ గత వైసిపి ప్రభుత్వం జీవో 85 జారీ చేసిందని తెలిపారు. టిడిపి అధికారంలోకి వస్తే జీవో 85ను రద్దు చేసి పాఠశాల విద్యలో తెలుగు మాధ్యమాన్ని పునరుద్ధరిస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారని చెప్పారు. అధికారంలోకి వచ్చి 11 నెలలు దాటినా ఆ జీవో 85ను రద్దు చేయలేదని విమర్శించారు. జీవోను రద్దు చేయక పోవడంతో పాటు మరింత పకడ్బందీగా అమలు చేస్తున్నారని వివరించారు. పొరుగు రాష్ట్రాలైన తమిళనాడు, కర్నాటక, ఒరిస్సాలో తెలుగు మాధ్యమం పాఠశాలలు ఉన్నాయన్నారు. మన రాష్ట్రంలో లేకపోవడం సిగ్గు చేటన్నారు. వైద్య విద్యలో క్యాపిటేషన్ ఫీజు ఉండకూడదన్నారు. ప్రతిభకు పట్టం కట్టాలని ఎన్‌టిఆర్ ఆనాడు చెప్పారని అన్నారు. అందుకు పూర్తి విరుద్ధంగా చంద్రబాబు పాలన సాగుతోందని తెలిపారు. పులివెందుల, పెనుగొండ, మదనపల్లె, ఆదోని, మార్కాపురం, పార్వతీపురం, అమలాపురం, బాపట్ల, నర్సీపట్నం తదితర ప్రభుత్వ మెడికల్ కళాశాలను ప్రయివేట్‌పరం చేయాలని చంద్రబాబు ప్రభుత్వం నిర్ణయించడం గర్హనీయమన్నారు. ప్రతిభకు పాడె కట్టడమే అవుతుందని తెలిపారు. తెలుగుగంగ, గాలేరు నగరి, హంద్రీ-నీవా, సాగునీటి ప్రాజెక్టులు ఎన్‌టిఆర్ మానస పుత్రికలు అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వాలు సాగునీటి రంగానికి 15 శాతం నిధులు కేటాయించి, ఖర్చు చేసి సింహ భాగం పూర్తి చేసినట్లు చెప్పారు. వైసిపి, టిడిపి ప్రభుత్వాలు సాగునీటి రంగాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేసినట్లు తెలిపారు. సమావేశంలో పులివెందుల నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సమన్వయ కర్త ధ్రువకుమార్ రెడ్డి, వేంపల్లె, వేముల, చక్రాయపేట మండలాల అధ్యక్షులు రామకృష్ణ, వెంకటేష్, రామాంజనేయరెడ్డి, అమర్నాథ్ రెడ్డి, ఉత్తన్న, నాగరాజు, రమణ, వినయ్, వేమయ్య, వేమారాజా, బద్రి, సాయి, రవి పాల్గొన్నారు.



పల్లా శ్రీనివాస్‌రావుకు స్వాగతం పలుకుతున్న టిడిపి నాయకులు

పెండింగ్ పనులు పూర్తి చేయండి

టిడిపి రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావుకు వినతి

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

మున్సిపల్ పరిధిలో పెండింగ్ పనులను పూర్తి చేయడానికి నిధులు కేటాయించాలని రాష్ట్ర టిడిపి అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్‌రావును పులివెందుల టిడిపి నాయకులు కోరారు. ఆ మేరకు ఆదివారం వారు వినతి పత్రం అందించారు. మహానాడు ఏర్పాట్లు పరిశీలించడానికి కడపకు వచ్చిన శ్రీనివాస్‌రావును పులివెందుల టిడిపి కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు టిడిపి పులివెందుల నియోజకవర్గ ఇన్‌ఛార్జి మారెడ్డి రవీంద్రనాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ చీఫ్ విప్ జివి ఆంజనేయులు, హజ్ కమిటీ సభ్యుడు మహబూబ్ బాషా, టిడిపి మాజీ పట్టణ అధ్యక్షుడు మద్దూరు వెంకట్రామిరెడ్డి, టిడిపి నాయకులు భాస్కర్‌రెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

టిడిపి రాష్ట్ర అధ్యక్షుడ్ని కలిసిన మురళీ యాదవ్

సింహాద్రిపురం : తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్ యాదవ్‌ను టిడిపి జిల్లా బీసీ సెల్ ఉపాధ్యక్షుడు లోమడ మురళీమోహన్ యాదవ్ కలిశారు. ఆదివారం పులివెందుల నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి బీటెక్ రవి, హెచ్‌ఎల్‌సి హై లెవెల్ కెనాల్ చైర్మన్ మారెడ్డి జోగిరెడ్డి ఆధ్వర్యంలో పలు సమస్యలను పార్టీ రాష్ట్ర అధ్యక్షుడికి వివరించారు. సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు మురళీమోహన్ యాదవ్ తెలిపారు.



మాట్లాడుతున్న ఎమ్మిగనూరు ఎమ్మెల్యే జయనాగేశ్వరరెడ్డి

జమ్మలమడుగు నుంచి భారీగా జనసమీకరణ

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

కపడలో నిర్వహించే మహానాడు కార్యక్రమానికి భూపేష్‌రెడ్డి ఆధ్వర్యంలో జమ్మలమడుగు నుంచి భారీగా హాజరుకానున్నట్లు ఎమ్మిగనూరు ఎమ్మెల్యే జయ నాగేశ్వరరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం సాయంత్రం స్థానిక టిడిపి కార్యాలయంలో స్థానిక టిడిపి ఇన్‌ఛార్జి భూపేష్ సుబ్బరామిరెడ్డి ఆధ్వర్యంలో విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ మహానాడుకు 25,000 మందితో 800 అన్ని రకాల వాహనాలతో కలిపి తరలిరానున్నట్లు తెలిపారు. జగన్‌మోహన్‌రెడ్డి ఓర్వలేక కుంటి సాకులు చెబుతున్నారన్నారు. కరోనాకు సంబంధించి తగు జాగ్రత్తలు తీసుకుంటామని తెలిపారు. భూపేష్‌రెడ్డి మాట్లాడుతూ మహనాడుతో రాయలసీమకు మహర్దశ రానుందన్నారు. మహానాడు తీర్మానంలో రాయలసీమ అభివృద్ధికి మెజార్టీ నివేదిక ఉంటుందన్నారు. మహానాడుకు జమ్మలమడుగు నుంచి అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ నారాయణరెడ్డి, యూత్ నాగేశ్వరరెడ్డి, రమణారెడ్డి, పొన్నతోట బ్రదర్స్, మోరగుడి విశ్వనాథ్ రెడ్డి, పాలూరు సుధీర్‌కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

టిడిపి మైనార్టీ నేతకు పరామర్శ

ప్రజాశక్తి - వేంపల్లె

కంటికి ఆపరేషన్ చేయించుకొని ఇంటి వద్ద ఉన్న మైనార్టీ నేత కరీముల్లాను టిడిపి మండల పరిశీలకుడు రఘునాథ్‌రెడ్డి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన కరీముల్లా ఆరోగ్య విషయాలపై ఆరా తీశారు. జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పార్టీ కార్యకర్తలకు ఆరోగ్య సమస్యలపై ఎలాంటి సహకారం కావాలన్నా ముందస్తు సమాచారం ఇవ్వాలని కోరారు. అనంతరం జిల్లా కార్యదర్శి ఎస్వీ జయరామిరెడ్డి ఇంటికి వెళ్లి పార్టీకి చెందిన పలు విషయాలపై చర్చించారు. కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ రామమునిరెడ్డి, వేమాకుమార్, ఫయాజ్, పలువురు టిడిపి నేతలు పాల్గొన్నారు.



కరీముల్లాను పరామర్శిస్తున్న టిడిపి మండల నాయకులు